
సాక్షి
గుంటూరు
మంగళవారం । 15 । అక్టోబర్ । 2024



కాళీమాత ఊరేగింపు

తెనాలి: శివాజీ చౌక్‌లోని శ్రీకాళీమాత దేవస్థానంలో దేవీ శర్నవరాత్రుల ముగింపు సందర్భంగా సోమవారం సాయంత్రం అమ్మవారి విగ్రహ ఊరేగింపును వైభవంగా నిర్వహించారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట:పులిచింతల ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 33,516 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 30,225 వదులుతున్నారు. ప్రస్తుతం 44.846 టీఎంసీల నిల్వ ఉంది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 588.90 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 3,371 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

కూటమికే కిక్కు లక్కు

- ముగిసిన మద్యం దుకాణాల లాటరీ
- షాపు తగిలిన వెంటనే ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఫోన్లు
- వాటా గురించి మాట్లాడుకోవాల్సిందే అంటూ హుకుం
- లేనిపక్షంలో షాపు అప్పగించాలని ఒత్తిళ్లు
- సిండికేట్లకు దక్కని షాపులు
- ఉత్తరప్రదేశ్ వారికి మూడు షాపులు
- 11 మంది మహిళలకు దక్కిన షాపులు
- రాష్ట్రంలో ముందుగా గుంటూరు జిల్లాలో ముగిసిన లాటరీ ప్రక్రియ

జిల్లాలో సోమవారం మద్యం దుకాణాల లాటరీ తంతు ముగిసింది. అనుకున్నట్టుగానే కూటమి నేతలకే కిక్కు లక్కు తగిలింది. మిగిలిన పార్టీల వారు పెద్దగా రంగంలో లేకపోవడంతో సింహభాగం షాపులు కూటమి నేతలకే దక్కాయి. సర్కార్ వారి మద్యం పాటలో ఈ సారి గుంటూరు జిల్లాలో సిండికేట్లకు షాక్ తగిలింది. కూటమి నేతల వ్యూహంలో ముచ్చటగా మూడు మాత్రమే రావడంతో విస్తుపోయారు. లాటరీలో షాపులు తగిలిన వారిని కూడా కూటమి నేతలు వదిలి పెట్టడం లేదు. తమ దారిలోకి తెచ్చుకోవడానికి సామదానదండోపాయాలు ప్రయోగిస్తున్నారు.

కోటరీకి మద్యం లాటరీ



శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో డ్రా తీస్తున్న జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ

సాక్షి ప్రతినిధి, గుంటూరు / నెహ్రూనగర్ (గుంటూరు తూర్పు): రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన మద్యం పాలసీకి సంబంధించి లాటరీ ప్రక్రియ సోమవారం ముగిసింది. గుంటూరు జిల్లాకు సంబంధించి 127 షాపులకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. మొత్తం 4,448 దరఖాస్తులు అందాయి. వీటికి సంబంధించి లాటరీ ప్రక్రియ గుంటూరు నగరంలోని శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ్‌తేజ ఆధ్వర్యంలో ఉదయం 8 గంటలకు ప్రారంభమై 11.40కి ముగిసింది. దరఖాస్తుదారుల సమక్షంలో, వీడియో చిత్రీకరణ మధ్య జేసీ లాటరీ తీశారు. నంబర్ వచ్చిన వ్యక్తి స్పాట్‌లో నగదు చెల్లించని పక్షంలో, మరలా లాటరీ తీసి రెండో వ్యక్తికి కేటాయించినట్లు ఆయన వివరించారు. రెండు లక్షల రూపాయల నాన్ రిఫండ్‌బుల్ ఫీజు ద్వారా ప్రభుత్వానికి జిల్లా నుంచి రూ.88.96కోట్లు ఆదాయం సమకూరిందన్నారు. దీంతో పాటు ప్రతి సంవత్సరం ప్రభుత్వానికి లైసెన్స్‌ల ద్వారా రూ.87.75కోట్లు ఆదాయం వస్తుందని చెప్పారు. షాపు తగిలిన వారు లైసెన్స్ ఫీజులో 1/6వ వంతు చెల్లించగా రూ.14.63కోట్లు ఆదాయం రానుందని పేర్కొన్నారు. అత్యధికంగా మంగళగిరిలో, అత్యల్పంగా పొన్నూరులో షాపులకు దరఖాస్తులు అందాయని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన లాటరీ ప్రక్రియలో గుంటూరు జిల్లాలో ముందుగా ముగిసిందని ఎక్సైజ్ శాఖ డెప్యూటీ కమిషనర్ డాక్టర్ కె. శ్రీనివాస్ తెలిపారు.

మొదలైన బేర'సారా'లు

127 మద్యం షాపులకు లాటరీ ప్రక్రియ ముగిసిన వెంటనే బేరసారాలు మొదలయ్యాయి. ఈసారి గుంటూరు జిల్లాలో సిండికేట్లకు షాక్ తగిలింది. తుళ్లూరు నుంచి వంద షాపులకు ఒక సిండికేట్ టెండర్లు దాఖలు చేయగా లాటరీలో వారికి రెండు మాత్రమే వచ్చాయి. మరో సిండికేట్ 130 షాపులకు దాఖలు చేయగా మూడు మాత్రమే రావడంతో షాక్ తిన్నారు. అయితే, ఎక్కువగా సింగిల్‌గా దాఖలు చేసిన వారికి వచ్చాయి. అయితే, వచ్చిన షాపుల్లో మెజారిటీ షాపులు కూటమి నేతలు, కార్యకర్తలకే దక్కాయి. మిగిలిన పార్టీల వారు పెద్దగా రంగంలో లేకపోవడంతో వీరికే సింహభాగం దక్కాయి. మిగిలిన షాపులను కూడా దక్కించుకునే విధంగా పావులు కదుపుతున్నారు టీడీపీ ఎమ్మెల్యేలు. దీంతో పాటు విజ్ఞాన మందిరం ప్రాంగణంలోనే టీడీపీ నాయకులు, కార్పొరేటర్లు సిండికేట్లుగా మారారు. షాపు దక్కించుకున్న వాళ్లను పిలిచి మరి బెదిరింపులకు దిగారు. వారి నుంచి షాపులు స్వాధీనం చేసుకునేందుకు బేరసారాలు నడిపించారు.

టీడీపీ ఎమ్మెల్యే అనుచరుడికి కూడా తప్పని బెదిరింపులు

సత్తెనపల్లి ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడికి ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఒక షాపు లాటరీలో తగిలింది. అయితే వెంటనే ప్రత్తిపాడు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఫోన్ చేసి '' ఎమ్మెల్యే గారు రమ్మంటున్నారు'' అంటూ ఆదేశాలు జారీ చేశారు. అయితే సదరు వ్యక్తి '' నేను కన్నా లక్ష్మీనారాయణ దగ్గర ఉంటాను...తరువాత వచ్చి కలుస్తాను'' అని సమాధానం చెప్పినట్లు సమాచారం. ప్రత్తిపాడులో 50 శాతం వాటా కోసం పట్టుబడుతున్నట్లు సమాచారం. డబ్బులు అయితే రూ. 25 నుంచి 30 లక్షల వరకూ డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది.

- గుంటూరు రూరల్ ప్రాంతమైన ఇన్నర్ రింగ్ రోడ్డు ప్రాంతంలో షాపులు పెట్టడానికి కూడా మద్యం వ్యాపారులు ఆలోచనలో పడినట్లు చెబుతున్నారు. గుంటూరు తూర్పులో షాపులు ఎవరికి వచ్చాయో చూసుకుని వారిని డబ్బులు కాకుండా వాటా ఇవ్వాలని ఎమ్మెల్యే భర్త అడుగుతున్నట్లు మద్యం వ్యాపారులు చెబుతున్నారు.
- తెనాలిలో తమకు 30 నుంచి 50 శాతం వాటా ఇవ్వాల్సిందేనని ముందుగానే హెచ్చరించడంతో చాలా తక్కువ టెండర్లు వేశారు.
- పొన్నూరులో తాము చెప్పిన వారు మాత్రమే టెండర్లు వేయాలని ఎమ్మెల్యే ఆదేశించడంతో జిల్లాలోనే అతి తక్కువ టెండర్లు ఈ నియోజకవర్గంలో పడ్డాయి.

మహిళలకు చాన్స్



లైసెన్స్ ఫీజు చెల్లిస్తున్న మహిళలు

మద్యం షాపులకూ మహిళా సెంటిమెంట్ పనిచేసింది. 11 మంది షాపులు దక్కించుకున్నారు. వీరికి గుంటూరు నగరపాలక సంస్థలో 1, రాజధాని ప్రాంతమైన మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో 5 , పెదకాకానిలో 1, మేడికొండూరులో 1, వట్టిచెరుకూరులో 1, తాడికొండలో 1, దుగ్గిరాలలో 1 చొప్పున దక్కాయి.

- ఉత్తరప్రదేశ్‌కు చెందిన వ్యాపారస్తులు ఆరు దరఖాస్తులు వేశారు. మూడు షాపులు మంగళగిరి ప్రాంతంలో తగిలాయి. లాటరీ తీసే సమయానికి వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో లేకపోవడంతో వారి కోసం ఎక్సైజ్ సిబ్బంది ఫోన్లు చేసి తెలుసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. తీరా వారి ఆధార్ కార్డులు చూసి ఉత్తరప్రదేశ్‌కు చెందిన వారని గుర్తించారు. వారికి తెలుగు రాదని గమనించిన సిబ్బంది కిందా మీదా పడి సమాచారాన్ని అందించారు.



హాజరైన దరఖాస్తుదారులు

ఇసుక బాగోతానికి తెర

- ముగిసిన టెండర్ల పర్వం
- ఆఖరి గంటలో 17కి పైగా వచ్చిన దరఖాస్తులు
- నేడు కలెక్టర్ సమక్షంలో తెరవనున్న బాక్స్
- సుమారు 50కి పైగా టెండర్లు వచ్చినట్లు సమాచారం



జిల్లా మైనింగ్ శాఖ డెప్యూటీ డైరెక్టర్ కార్యాలయం వద్ద పోలీసుల బందోబస్తు

లక్ష్మీపురం: జిల్లాలో ఇసుక టెండర్ల దరఖాస్తులకు గడువు సోమవారం సాయంత్రం 3 గంటలతో ముగిసింది. జిల్లా మైనింగ్ శాఖ డెప్యూటీ డైరెక్టర్ శ్రీ వెంకటసాయి సమక్షంలో పోలీస్ బందోబస్తు నడుమ అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రక్రియ పూర్తయింది. అయితే, సోమవారం మధ్యాహ్నం 1.30 గంటల వరకు మూడు టెండర్లు మాత్రమే వచ్చాయి. రెండు గంటల తరువాత సీన్ మారింది. ఒక్కసారిగా అధికార పార్టీకి చెందిన వారు అధిక సంఖ్యలో జిల్లా కార్యాలయానికి చేరుకున్నారు. ఆఖరి సమయం మధ్యాహ్నం 3 గంటలకు కల్లా 20కి పైగా పడ్డాయి. వీటితో కలుపుకుని జిల్లావ్యాప్తంగా మొత్తం 50కి పైగా దరఖాస్తులు వచ్చాయి. వాస్తవానికి సోమవారం ఉదయం టెండర్ ఫారాల్ని 50 వరకు తీసుకు వెళ్లారు గానీ గడువు సమయానికి 20 మందే దాఖలు చేశారు. బిడ్ దాఖలు చేసిన వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం టెండర్ దక్కుతుందా..? లేక అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో టెండర్ బాక్స్ తెరుచుకుంటుందో చూడాల్సి ఉంది.

ఆఖరి గంటలో పెద్దఎత్తున దాఖలు

జిల్లావ్యాప్తంగా ఈనెల 8వ తేదీ నుంచి 11 వరకు 28 మంది మాత్రమే దరఖాస్తు చేశారు. శనివారం దసరా పండుగ, ఆదివారం కావడంతో సంఖ్య పెరగలేదు. సోమవారం ఆఖరు తేదీ కావడంతో పలువురు దాఖలు చేశారు. ఆఖరి గంట వ్యవధిలో 17కి పైగా టెండర్ దరఖాస్తు ఫారాలు వచ్చినట్లు ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా మైనింగ్ శాఖ డెప్యూటీ డైరెక్టర్ శ్రీ వెంకట సాయి తెలిపారు. టెండర్ బాక్స్‌ను మంగళవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు జిల్లా కమిటీ, అందరి సమక్షంలో తెరవనున్నట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయానికి టెండర్ బాక్స్‌ను తీసుకు వెళ్లే వరకు మైనింగ్ జిల్లా శాఖలో పోలీసు బందోబస్తు రాత్రి అంతా కొనసాగుతుందని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు.

కొల్లిపరలో అత్యధికంగా 29.4 మి.మీ. వర్షం

కొరిటెపాడు(గుంటూరు): జిల్లాలో ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు అత్యధికంగా కొల్లిపర మండలంలో 29.4 మి.మీ., అత్యల్పంగా ఫిరంగిపురం మండలంలో 1 మి.మీ. వర్షం పడింది. సగటున 6 మి.మీ. వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. కాకుమాను 26.8, చేబ్రోలు 15.2, తెనాలి 7.4, గుంటూరు తూర్పు 6, ప్రత్తిపాడు 4.8, పెదనందిపాడు 3.8, గుంటూరు పశ్చిమ 3.2, దుగ్గిరాల 2.8, తాడికొండ 2.4, తుళ్ళూరు 1.8, పొన్నూరు 1.6, వట్టిచెరుకూరు మండలంలో 1.6 మి.మీ. చొప్పున వర్షం పడింది. జిల్లాలో సాధారణ వర్షపాతం అక్టోబర్ 14వ తేదీ వరకు 58.4 మి.మీ.లకు గానూ ఇప్పటి వరకు 60 మి.మీ. నమోదైంది.

17 నుంచి రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్స్ పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు) : స్థానిక బీఆర్ స్టేడియంలో 17 నుంచి 19 వరకు జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు కార్యదర్శి ఎస్.సుబ్బారావు సోమవారం తెలిపారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్‌ల విభాగంలో పోటీలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 250 మంది ఈ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు కోచ్ అఫ్రోజ్ ఖాన్ నంబర్ 8143143222ను సంప్రదించాలని సూచించారు.

అర్జీలకు అధిక ప్రాధాన్యం

డీఆర్వో పెద్ది రోజా



అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్వో

గుంటూరు వెస్ట్: ప్రజల నుంచి వచ్చే అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజా అధికారుల్ని ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆమె మాట్లాడారు. కొన్ని అర్జీలు పరిష్కారం కాకుండానే క్లోజ్ చేస్తున్నారన్నారు. ఇటువంటి వేదికపై వచ్చే అర్జీలకు అధిక ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న వాటిని ఆయా శాఖాధికారులు పరిశీలించాలని ఆదేశించారు. కోర్టు కేసులకు సంబంధించి నిర్దిష్ట కాలంలోనే సమాధానాలివ్వాలని సూచించారు. అనంతరం వచ్చిన 80 అర్జీలను డీఆర్వో, డెప్యూటీ కలెక్టర్ లక్ష్మీ కుమారి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, జిల్లా అధికారులు పరిశీలించారు.

సెల్ టవర్ అద్దె ప్రభుత్వానికి రావాలి

పెదకాకాని మండలం తక్కెళ్ళపాడులోని పోరంబోకు స్థలంలో వి.శ్రీనివాసరావు అనే వ్యక్తి రెండు సెల్ టవర్లకు అద్దెకు ఇచ్చాడు. అక్కడి నుంచి నెలకు రూ.80 వేలు అద్దె కింద తీసుకుంటున్నాడు. వాస్తవానికి గ్రామ పంచాయితీకి రావాల్సిన ఆ మొత్తాలను సొంతానికి వాడుకుంటున్నాడు. దీనిపై విచారణ జరిపించండి.

– కె.రాజా రమేష్

వర్షాల నేపథ్యంలో కంట్రోల్ రూం ఏర్పాటు

నెహ్రూనగర్: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజల నుంచి అందే ఫిర్యాదుల పరిష్కారానికి, సత్వర స్పందన కోసం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో 0863–2345105 కంట్రోల్ రూం (24 గంటలు పనిచేసేలా) ఏర్పాటు చేశామని కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంట్రోల్ రూంలో మూడు షిఫ్టులుగా సిబ్బందిని కేటాయించామని పేర్కొన్నారు. ప్రజల నుంచి అందే ఫిర్యాదులు, వాటి పరిష్కార చర్యలపై ఎస్ఈ, సీఎంఓహెచ్, ఎంహెచ్ఓలు సమన్వయం చేసుకుంటారని వెల్లడించారు. నగరంలో వర్షాల వల్ల రోడ్ల మీద చెట్లు పడితే తొలగించడానికి వీలుగా సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఏడీహెచ్‌ని ఆదేశించారు. తాగునీటి పంపింగ్ రిజర్వాయర్లలో విద్యుత్ అంతరాయం వల్ల సరఫరాకి ఇబ్బంది రాకుండా ముందస్తుగా జనరేటర్లు ఏర్పాటు చేసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరితే వెంటనే తొలగించడంతో పాటు ప్రజల్ని పునరావాస కేంద్రాలకు తరలించడానికి సిద్ధంగా ఉండాలని ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు.

తీరంలో అలలు కల్లోలం

- 18 వరకు కోస్తాంధ్రలో భారీ వర్షాలు
- తీరంలో ఎగసిపడుతున్న అలలు
- బలంగా వీస్తున్న ఈదురు గాలులు
- నాలుగురోజుల వరకు వేటకు వెళ్ల వద్దంటూ మత్స్యకారులకు ఆదేశాలు
- బాపట్ల జిల్లాలో సగటున 14.5 మీ.మీ. వర్షపాతం నమోదు

బాపట్ల టౌన్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లా వ్యాప్తంగా రెండు రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా డ్రెయిన్లు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వరద ఉధృతికి లంక గ్రామాల్లోని ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లాలో అత్యధికంగా చినగంజాం మండలంలో 34.6 మి.మీ వర్షపాతం నమోదుకాగా, అమర్తలూరులో అత్యల్పంగా 2.0 మి.మీ వర్షపాతం నమోదైంది.

ఆందోళనలో అన్నదాతలు

మరో నాలుగు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలియజేయడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల వచ్చిన వరదలకు పూర్తిగా నష్టపోయారు. ఆ నష్టం నుంచి పూర్తిగా కోలుకోకముందే మరో అల్పపీడనం ఏర్పడి జిల్లాలో వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో రైతులు భయాందోళనకు గురౌతున్నారు. ప్రస్తుతం వరిసాగు పొట్ట, పాలుపోసుకునే దశలో ఉన్నాయి. ఈ తరుణంలో వర్షాలు కురవడం వలన గింజ తాలుగా మారే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు.

తీరానికి చేరిన పడవలు

అల్పపీడనం కారణంగా తీరంలో సుమారు మూడు మీటర్ల మేర అలలు ఎగిసిపడుతున్నాయి. తీర ప్రాంతాల్లో గంటకు 55 నుంచి 65 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీస్తున్నాయి. దీంతో మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని ఇప్పటికే ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. నాలుగైదు రోజుల కిందట వేటకు వెళ్లి ఇప్పటికీ సముద్రంలో ఉన్న మత్స్యకారులను వెనక్కి పిలిచే పనిలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. జిల్లాలోని నిజాంపట్నం, ఈపూరుపాలెంలలో సుమారు 200 పడవలకు లంగర్‌వేశారు. ఈనెల 18 వరకు మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లొద్దని అధికారులు ఆదేశాలు జారీచేశారు.

జిల్లాలో వర్షపాతం నమోదు ఇలా...

జిల్లా వ్యాప్తంగా 361.4 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. చిన్నగంజాంలో 34.6మి.మీటర్లు, చుండూరు 3.8 మి.మీ, అమర్తలూరు 2.0, వేమూరు 17.8, కొల్లూరు 10.2, భట్టిప్రోలు 32.2, చెరుకుపల్లి 25.2, పిట్టలవానిపాలెం 15.6, కర్లపాలెం 26.4, బాపట్ల 22.8, నిజాంపట్నం 10.8, నగరం 24.2, రేపల్లె 20.2, సంతమాగులూరు 6.2, బల్లికురవ 2.6, మార్టూరు 14.4, యద్దనపూడి 6.6, పర్చూరు 9.6, కారంచేడు 10.2, ఇంకొల్లు 22.4, జె.పంగులూరు 2.0, అద్దంకి 5.4, కొరిశపాడు 6.2, చీరాల 9.6, వేటపాలెం 20.4 మి.మీటర్ల వర్షం కురిసింది.



సూర్యలంక తీరంలో ఎగసిపడుతున్న అలలు

అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

బాపట్ల: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా అధికారులతో స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం సమావేశం నిర్వహించారు. అనంతరం మండల స్థాయి అధికారులతో వీక్షణ సమావేశం ద్వారా మాట్లాడారు. భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ఆర్డీవో కార్యాలయాల్లోనూ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 19వ తేదీ వరకు అధికారులు, ఉద్యోగులు సెలవులు పెట్టరాదని, ఇప్పటికే సెలవుల్లో ఉంటే వారి సెలవులు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి, ఆ ప్రాంతంలో నివసించే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేయాలని సూచించారు. పునరావాస కేంద్రాలను ఎంపిక చేసుకోవాలన్నారు.

న్యూస్‌రీల్

పూర్ణాహుతితో ముగిసిన దసరా ఉత్సవాలు



అమరావతి:అమరావతిలోని శ్రీ బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి వారి శ్రీ దేవీ శరన్నవ రాత్రోత్సవాలు సోమవారం పూర్ణాహుతితో ముగిశాయి. తొలుత చండీదేవి సమేత అమరేశ్వరస్వామి వారికి నంది మండపంలో చూర్ణోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులకు తిరువంజనం చేసి నూతన వస్త్రాలంకరణ చేసి వసంతోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ స్థానాచార్యుడు కౌశిక చంద్రశేఖరశర్మ మాట్లాడుతూ పంచాహ్నిక దీక్షతో నిర్వహించే దసరా ఉత్సవాలు ముగిసినట్లు ప్రకటించారు. రాత్రి 10 గంటలకు నిర్వహించే ధ్వజావరోహణ కార్యక్రమంతో స్వామివారి ఏకాంతసేవ మహోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. వసంతోత్సవం అనంతరం స్వామివారిని పల్లకీలో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమాలలో ఆలయ ఈఓ వేమూరి గోపీనాథశర్మ, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఓగేరు వాగులోకి దూసుకెళ్లిన లారీ



రొంపిచర్ల: మండలంలోని మర్రిచెట్టుపాలెం గ్రామ సమీపంలో శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ఎక్స్‌ప్రెస్ వేపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ బోల్తా కొట్టి డ్రైవర్, క్లీనర్లకు స్వల్ప గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. ఒంగోలు వైపు నుంచి కెమికల్ లోడ్‌తో హైదరాబాదుకు వెళుతున్న లారీ మర్రిచెట్టుపాలెం సమీపంలోకి రాగానే అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న ఓగేరు వాగులోకి దూసుకెళ్లి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో లారీ నడుపుతున్న డ్రైవర్, క్లీనర్లకు స్వల్ప గాయాలయ్యాయి. డ్రైవర్ నిద్ర మత్తులోకి జారుకోవడం వల్లనే ఈ ప్రమాదం సంభవించిందని స్థానికులు భావిస్తున్నారు.

మల్లేశ్వరుని సేవలో ఐజీ రామకృష్ణ



పెదకాకాని: శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామిని సోమవారం రాష్ట్ర ఇంటిలిజెన్స్ ఐజీ పి.హెచ్.డి. రామకృష్ణ దర్శించుకున్నారు. ఆయనకు ఉప కమిషనర్ గోగినేని లీలాకుమార్, అర్చకులు, వేదపండితులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసిన ఐజీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక అభిషేకాలు, కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. అర్చకులు, పండితులు వేద ఆశీర్వచనం చేశారు. ఉప కమిషనర్ స్వామివారి శేషవస్త్రంతో ఘనంగా సత్కరించి, చిత్రపటం బహూకరించారు.

నేడు ఎంపీహెచ్‌ఏలకు ప్రమోషన్ కౌన్సెలింగ్

గుంటూరు మెడికల్: మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఫిమేల్)గా పనిచేస్తున్న వారికి మంగళవారం ప్రమోషన్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు డాక్టర్ కె.సుచిత్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఎనిమిది మంది ఎంపీహెచ్ఏ ఫిమేల్ అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించి స్టాఫ్ నర్సులుగా ప్రమోషన్ అందజేస్తామని ఆమె పేర్కొన్నారు.

అండర్ -25 క్రికెట్‌కు మంగళగిరి యువకుడి ఎంపిక



తాడేపల్లి రూరల్ : మంగళగిరి పట్టణానికి చెందిన యువకుడు బెంగళూరులో జరిగే అండర్–25 మెన్ మల్టీడే క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. క్రికెట్‌లో మంగళగిరికి చెందిన కడియం పవన్‌సాయి రాహుల్ ప్రతిభ కనబర్చడంతో ఆంధ్రప్రదేశ్ నుంచి ఆడేందుకు అవకాశం లభించింది.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **2,000** గరిష్ఠం : రూ. **5,800**

మోడల్ ధర రూ. **5,000**

క్లుప్తంగా

మంగళగిరి కోర్టును ఆశ్రయించిన ముంబై పోలీసులు



తాడేపల్లి రూరల్ : ముంబై పోలీసులు సోమవారం మంగళగిరి కోర్టును ఆశ్రయించారు. వస్త్రాల దొంగతనం కేసులో పట్టుబడిన ముగ్గురిలో ఇద్దరిని ముంబై తీసుకువెళ్లేందుకు అనుమతి తీసుకున్నారు. వివరాలు.. ముంబైలో గత నెల 30వ తేదీ ఓ వస్త్ర దుకాణంలో కొందరు దుస్తులతో పాటు బంగారాన్ని చోరీ చేశారు. ఈ దొంగతనం చేసింది గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన వారిగా గుర్తించి ఇక్కడకు చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో ముంబై పోలీసులు మూడు రోజుల పాటు తాడేపల్లిలో ఉండి వివిధ కోణాల్లో దర్యాప్తు చేసి వారిలో ప్రసాద్, కుమార్, శ్రీకాంత్‌లను అదుపులోకి తీసుకుని తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో విచారించారు. ఇందులో శ్రీకాంత్‌కు సంబంధం లేకపోవడంతో అతడ్ని వదిలివేశారు. పట్టుబడిన ఇద్దరిని 24 గంటల్లో కోర్టులో హాజరు పరచాల్సి ఉంది. ఇక్కడి నుంచి ముంబై వెళ్లేందుకు సమయం సరిపోదని ముందుగానే మంగళగిరి కోర్టులో హాజరు పరిచారు. కోర్టు అనుమతితో ముంబైకు తీసుకువెళ్లారు. ఇప్పటి వరకు పట్టుబడిన వారి నుంచి కొన్ని చీరలు, దుస్తులు మాత్రమే రికవరీ చేశారు. మిగిలిన నిందితులు ఎవరు అనేది త్వరలోనే గుర్తించి ముంబైకి తీసుకువెళతామని వారు

బాధితుల సమస్యలకు సత్వర పరిష్కారం



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ

- జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్
- ప్రజా సమస్యల ఫిర్యాదుల పరిష్కార వేదికలో పలువురు అర్జీలు

నగరంపాలెం: జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల ఫిర్యాదుల పరిష్కార వేదికలో బాధితులు అర్జీలు అందించారు. ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసగించారని... రూ.12.50 కోట్ల ఆస్తిని కాజేయాలని ఓ బ్రోకర్ బెదిరింపులకు పాల్పడుతున్నాడని.. ఇంటి నుంచి గెంటేసిన కన్నకొడుకుపై చర్యలు తీసుకోవాలని ఓ వృద్ధుడు.. ఇలా ఫిర్యాదులు వచ్చాయి. బాధితుల నుంచి జిల్లా ఎస్పీ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదిదారుల సమస్యలను చట్టపరిధిలో సత్వరమే పరిష్కరించాలని పోలీస్ అధికారుల్ని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీ (పరిపాలన) రమణమూర్తి, మహిళా పీఎస్ డీఎస్పీ సుబ్బారావు కూడా అర్జీలు స్వీకరించారు.

ఉద్యోగాలు పేరిట మోసం

ఏడాది క్రితం తెలిసిన బంధువు ద్వారా వ్యక్తి పరిచయమయ్యాడు. గతంలో గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో, ప్రస్తుతం పల్నాడు జిల్లాలో పని చేస్తున్నాడు. అయితే, తమకు నరసరావుపేట మున్సిపల్ కార్యాలయంలో అటెండర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికాడు. ఈ క్రమంలో అతనికి లక్షన్నర చొప్పున చెల్లించాం. ఉద్యోగాలు ఇప్పించక పోగా డబ్బులు చెల్లించాలని అడిగితే సమాధానం లేదు. తమతోపాటు నరసరావుపేటలో మరో ముగ్గురి వద్ద రూ.12 లక్షలు వసూలు చేశాడు.

– కాలేషావలి (రెడ్లబజార్, పాతగుంటూరు)
మహబూబ్ బాషా (పెదకూరపాడు)

మోసగించిన మిర్చి వ్యాపారి

ఆరు నెలలు క్రితం గుంటూరు వ్యాపారి 70 క్వింటాళ్ల మిరప కొనుగోలు చేశాడు. రూ.25 లక్షలు చెల్లించాల్సి ఉంది. విక్రయించిన తొలినాళ్లలో అడిగితే అదిగో ఇదిగో అంటూ ముప్పుతిప్పలకు గురిచేశాడు. గత మూడు నెలలుగా వ్యాపారి మొబైల్ ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోంది. చివరికి నెల్లూరు జిల్లాలోని ఆయన ఇంటి వద్దకెళ్లగా ఎవరూలేరు. న్యాయం చేయగలరు.

– మహబూబ్ సుభాని,
లింగంగుంట్ల, పెదకూరపాడు

తప్పుడు కేసులతో బెదిరింపులు

తల్లి ఉమాదేవి వ్యవసాయ శాఖలో అటెండర్‌గా పనిచేసేది. సోదరుడు చనిపోతే ఆస్తి విషయమై కుటుంబ సభ్యుల్లో ఒకరు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు మమ్మల్ని ఇబ్బందులకు గురిచేశారు. ఈ క్రమంలో తల్లి ఆత్మహత్యకు పాల్పడింది. అయితే కుటుంబ సభ్యుల్లో ఒకరు, పోలీసుల వేధింపుల వల్లే చనిపోయింది. ఆఖరికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం రాకుండా చేశారు. అదిగాక నాపై తప్పుడు కేసులు బనాయించారు. తల్లి మృతి చెంది మూడేళ్లు గడిచిన కేసులో పురోగతిలేదు. అంతేగాక బెదిరింపులకు పాల్పడుతున్నారు.

– అరుణకుమార్, శ్రీనివాసరావుపేట.

ఆస్తిని కాజేయాలని కుయుక్తులు

పొన్నెకల్లులో ఐదు సెంట్ల భూమి ఉంది. మూడు నెలలు కిందట ఇద్దరికి రూ.12.50 కోట్లకు విక్రయించేందుకు ఒప్పందం చేసుకుని, కొంత బయానా తీసుకుని అగ్రిమెంట్ రాసిచ్చాను. అందులో ఓ బ్రోకర్‌కు రూ.2 లక్షలు చెల్లించగా, మరో బ్రోకర్ ఎక్కువ చెల్లించాలని డిమాండ్ చేశాడు. దీంతో డబ్బులు చెల్లించేందుకు నిరాకరించా. ఈ క్రమంలో సదరు బ్రోకర్ నా సంతకాలు ఫోర్జరీ చేసి, పాత స్టాంప్ కాగితాలపై ఒక అగ్రిమెంట్ రూపొందించాడు. అతనికి 2018లో విక్రయించినట్లు, రిజిస్టర్ చేయాలని బెదిరిస్తున్నాడు. తప్పుడు సంతకాలతో ఫోర్జరీ చేసి, నాపై తప్పుడు దావా వేసి ఆస్తి కాజేయాలని ప్రయత్నిస్తున్న బ్రోకర్‌పై చర్యలు తీసుకోవాలి.

– అల్లడి ప్రసాదరావు, అన్నపూర్ణానగర్, గోరంట్ల

రూ. 20 లక్షలు చెల్లించాం

కుమార్తెలిద్దరికి ఉద్యోగాలు యిప్పిస్తానంటే రెండేళ్ల క్రితం చేబ్రోలులోని ఓ ప్రైవేటు ఉపాధ్యాయుడికి రూ.20 లక్షలు చెల్లించా. ఉద్యోగాల విషయమై అడిగితే రెండేళ్లగా కాలయాపన చేస్తున్నాడు. కనీసం తాము చెల్లించిన డబ్బులు ఇవ్వాలని అడిగితే బెదిరింపులకు పాల్పడుతున్నాడు. న్యాయం చేయగలరు.

– ఎ.అరుణ, సుద్దపల్లి, చేబ్రోలు

ఇంటి నుంచి గెంటేశారు

నాకు ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు సంతానం . అయితే, ఇద్దరు కొడుకులు ఆస్తి కాజేసి, ఇంటి నుంచి గెంటేశారు. ప్రస్తుతం కుమార్తె వద్ద ఉంటున్నా. కొడుకుల తీరుపై పలుమార్లు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. సీనియర్ సిటిజన్స్ చట్టం ప్రకారం వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నా.

– సీహెచ్.సత్యనారాయణ,
పెనుమాక, తాడేపల్లి మండలం

గుంటూరు రీజినల్ విజిలెన్స్‌లో బదిలీలు

నగరంపాలెం: గుంటూరు రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలోని పలువురు అధికారులను వారి మాతృ శాఖలకు బదిలీ చేస్తూ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ హరీష్‌కుమార్ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. సీఐ శీలం శ్రీనివాసులరెడ్డి (పోలీస్ శాఖ), డీఈఈ కె.విజయవీరకుమార్, ఏఓ కె.రమణకుమార్ (వ్యవసాయ శాఖ), సీనియర్ అసిస్టెంట్ కె.మల్లికార్జునరెడ్డి (కమర్షియల్ టాక్స్)ను బదిలీ చేశారు.

విజిలెన్స్ సీఐగా శివాజీ

గుంటూరు రీజినల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగపు సీఐగా పి.శివాజీ సోమవారం గుంటూరు కలెక్టరేట్ ఆవరణలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. సీఐ శ్రీనివాసులరెడ్డిని మాతృశాఖకు బదిలీ చేశారు.

ఇంటి కిటికీ తలుపులు తొలగించి చోరీ

లక్ష్మీపురం: దొంగలు ఇంటి కిటికీ తలుపులు తొలగించి లోపలకు చొరబడి బంగారం, వెండి ఎత్తుకుపోయిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. విద్యానగర్ 1/1 వ అడ్డరోడ్డులో శ్రీరాముల చౌదరి నివసిస్తున్నారు. వ్యాపారం రీత్యా వారం వారం హైదరాబాద్ వెళ్ళి వస్తుంటారు. అయితే, ఈనెల 12న అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి కిటికీ తలుపులు తొలిగించి లోపలకు ప్రవేశించి, దొంగతనానికి పాల్పడ్డారు. మరుసటి రోజు స్థానికులు గుర్తించి ఇంటి యజమానికి, పట్టాభిపురం పోలీసులకు సమాచారం తెలియజేశారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని విచారణ చేపట్టారు. ఈలోగా హైదరాబాద్ నుంచి సోమవారం శ్రీరాములు ఇంటికి వచ్చారు. బీరువాలోని 45 గ్రాముల బంగారం, 20 కేజీల వెండి వస్తువులు కనిపించకుండా పోయాయి. శ్రీరాములు ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్‌జీ రంగా సాహిత్య పురస్కారం విజేతలు వీరే..

నగరంపాలెం: ఆచార్య ఎన్‌జీ రంగా ఫౌండేషన్ – 2024 సాహిత్య పురస్కారాల ఎంపిక పూర్తయినట్లు అధ్యక్షులు డాక్టర్ జక్కంపూడి సీతారామారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లోని రచయిత్రుల నుంచి నవలను ఇటీవల ఆహ్వానించినట్లు ఆయన చెప్పారు. న్యాయ నిర్ణేతల సూచన మేరకు వి.శాంతి ప్రబోధ రచించిన 'బతుకు సేద్యం' నవలకు ప్రథమ బహుమతి (రూ.10 వేలు), ద్వితీయ బహుమతిని పి.సుజాత రాసిన 'పచ్చబొట్టు' నవలకు (రూ.5 వేలు), విశిష్ట బహుమతిగా 'నీలంపు రాసి' నవల రచయిత్రి చంద్రలతను ఎంపిక చేశామని తెలిపారు. వచ్చేనెల ఏడో తేదిన గుంటూరు బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి వారి దేవాలయ ప్రాంగణంలో జరిగే ఆచార్య ఎన్‌జీ రంగా జయంతి వేడుకల సభలో సత్కారం, బహుమతి ప్రదానం చేస్తామని ఆయన వెల్లడించారు.

సత్తెనపల్లిలో మహిళపై హత్యాయత్నం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కరుణమ్మ

ముప్పాళ్ళ(సత్తెనపల్లి): ప్రియురాలు కనిపించకుండా పోయిందనే అక్కసుతో ప్రియురాలి తల్లిపై కత్తితో హత్యాయత్నానికి ప్రయత్నించిన సంఘటన పట్టణంలోని 2వ వార్డులో సోమవారం జరిగింది. సంఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని 2వ వార్డు15వ లైనుకు చెందిన రావినూతల కరుణమ్మ కు నలుగురు కుమార్తెలు. వారిలో రెండవ కుమార్తె భారతికి 17వ వార్డు, సుందరయ్యకాలనీకి చెందిన పీ.పూర్ణచంద్రరావు కు మధ్య రెండేళ్ళుగా వివాహేతర సంబంధం నెలకొంది. ఈ క్రమంలో కొద్ది రోజుల నుంచి భారతి కనిపించకుండా పోవటంతో పూర్ణచంద్రరావు 2 వార్డులో ఉంటున్న కరుణమ్మ ఇంటికి వెళ్ళి నీ కూతుర్ని ఎక్కడ దాచి పెట్టావు అంటూ మంచంపై నిద్రిస్తున్న మహిళ పై కత్తితో దాడి చేశాడు. దాడిలో కరుణమ్మ తలకు, కుడిచేతిపై, ఎడంచేతిపై, పొట్టపై బలమైన గాయాలు కావటంతో చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. గతంలోను కరుణమ్మ పై పూర్ణచంద్రరావు చేసిన దాడిలో కుడి చేయి విరిగింది. అనంతరం ఇరువురు రాజీ చేసుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరి, బాధితురాలి నుంచి వివరాలు నమోదు చేసుకున్నారు. జరిగిన సంఘటనపై కరుణమ్మ ఫిర్యాదు మేరకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ బ్రహ్మయ్య తెలిపారు. హత్యాయత్నానికి ప్రయతించిన వ్యక్తి పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

గోవా పోటీలకు గుంటూరు క్రీడాకారుల ఎంపిక

తాడేపల్లి రూరల్ : గోవాలో జరిగే నేషనల్ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ మాస్టర్స్ మెన్ అండ్ ఉమెన్ బెంచ్ ప్రెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ బెంచ్ ప్రెస్ టీమ్‌లో జిల్లాకు చెందిన ముగ్గురు పవర్ లిఫ్టర్లు ఎంపికైనట్లు పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కొమ్మాకుల విజయభాస్కర్, ప్రధాన కార్యదర్శి షేక్ సంధాని సంయుక్తంగా తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మెన్ జూనియర్ బెంచ్ ప్రెస్‌కు రమేష్ శర్మ (జూనియర్), ఉమెన్ బెంచ్ ప్రెస్‌కు కాంతకుమారి (మాస్టర్స్-1), జ్యోతి వర్మ (మాస్టర్స్-2)లు ఎంపికయ్యారని తెలిపారు. మెన్ జూనియర్ 74 కేజీల విభాగంలో రమేష్ శర్మ, 76 కేజీల విభాగంలో కాంతకుమారి, 69 కేజీల విభాగంలో జ్యోతివర్మ ఈనెల 14వ తేదీ నుంచి 18 వరకు గోవాలో జరిగే పోటీల్లో పాల్గొననున్నారని వెల్లడించారు. వీరికి ఫిట్ జోన్ కోచ్ సంధాని శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ వైస్ చైర్మన్ వంశీకృష్ణ, కోశాధికారి జి. వెంకటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్లు బి.ప్రసాద్, బి. చంద్రిక, భాస్కర్, జాయింట్ సెక్రటరీలు జి. సాయిరేవతి, యస్‌డి. మస్తాన్ వలి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు ఎ. పవన్‌కుమార్, పి. సందీప్, జి. నాగమల్లేశ్వరరావు, కె. మధుబాబు, యస్‌కె. సుభాని పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారులు రమేష్‌శర్మ, కాంతకుమారి, జ్యోతి వర్మలతో కార్యవర్గం

పవర్ లిఫ్టింగ్‌లో కేఎల్‌యూ విద్యార్థినికి పతకాలు

తాడేపల్లి రూరల్: వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ విద్యార్థిని కామన్‌వెల్త్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో నాలుగు కాంస్య పతకాలు సాధించింది. యూనివర్సిటీలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైస్ చాన్సలర్ డాక్టర్ ఎ.వి.ఎస్. ప్రసాద్ మాట్లాడారు. బీసీఏ విద్యార్థిని జ్ఞాన దివ్య ఈనెల 4 నుంచి 13 వరకు దక్షిణాఫ్రికాలో జరిగిన కామన్‌వెల్త్ పవర్ లిఫ్టింగ్ క్రీడల్లో ఇండియా తరపున అత్యంత ప్రతిభ కనబరిచి, నాలుగు కాంస్య పతకాలు సాధించిందని తెలిపారు. క్రీడల్లో రాణిస్తున్న వారికి తమ వర్సిటీలో వంద శాతం ఫీజు రాయితీ ఇస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ డాక్టర్ జి. పార్థసారథివర్మ, ప్రో వీసీ డాక్టర్ ఎస్. వెంకటరామ్, డాక్టర్ కె. రాజశేఖరరావు, రిజిస్ట్రార్ కె. సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కె.ఆర్.ఎస్. ప్రసాద్, క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె. హరికిశోర్ తదితరులు విద్యార్థిని జ్ఞాన దివ్యను అభినందించారు.



జ్ఞాన దివ్యను అభినందిస్తున్న ప్రొఫెసర్లు

భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

- ఏపీసీపీడీసీఎల్ గుంటూరు సర్కిల్ పర్యవేక్షణ ఇంజనీర్ మూర్తి

కొరిటిపాడు(గుంటూరు): భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలంతా విద్యుత్ ప్రమాదాల నుంచి అప్రమత్తంగా ఉండాలని ఏపీసీపీడీసీఎల్ గుంటూరు సర్కిల్ పర్యవేక్షణ ఇంజనీర్ కె.వి.ఎల్.ఎన్.మూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్కడైనా 33 కేవీ, 11 కేవీ, ఎల్‌టీ లైన్లు తెగిపడితే వాటిని తాకకుండా వెంటనే కంట్రోల్ రూం నంబర్ : 9440817526, టోల్ ఫ్రీ నంబర్ : 1912కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు. గుంటూరు సర్కిల్ ఆకార్యాలయం విద్యుత్ భవన్‌లో కంట్రోల్ రూమ్ ప్రారంభించినట్లు పేర్కొన్నారు. తడిచిన విద్యుత్ స్తంభాలను తాకవద్దని ఆయన సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మంటలు, శబ్దం వస్తే కంట్రోల్ రూంకు తెలియజేయాలని కోరారు. భారీ వర్షాల కారణంగా తేమ ఎక్కువగా ఉండటం వల్ల ఇళ్లలో మోటార్ స్విచ్‌లు, విద్యుత్ పరికరాలు వినియోగించేటప్పుడు ప్రమాదాలు బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తడి వస్త్రాలు ఆరవేసే తీగలు కరెంట్ స్తంభాలు, తీగలకు తగలకుండా చూసుకోవాలని ఆయన తెలిపారు. తెగిపడిన లైన్లు, పాడైపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను సిబ్బంది కూడా తక్షణం మరమ్మతులు చేసి సరఫరా పునరుద్ధరించాలని ఆయన ఆదేశించారు.

అల్పపీడనం.. అధిక ప్రభావం

- భారీ వర్షాలతో లోతట్టు ప్రాంతాలు జలమయం
- నీట మునిగిన నారుమళ్లు, పైర్లు
- చినగంజాం మండలంలో 34.6 మి.మీ వర్షం



ఉధృతంగా ప్రవహిస్తున్న ఈపురుపాలెం స్ట్రయిట్‌కట్ కాలువ

సాక్షినెట్ వర్క్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. అల్పపీడనం కారణంగా కురిసిన వర్షంతో పర్చూరు, చీరాల, అద్దంకి నియోజకవర్గాల్లో పలు వీధులు జలమయం అయ్యాయి. రోడ్ల మీద వర్షపు నీరు ప్రవహించడంతో వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చీరాల పట్టణంలోని సెయింట్ మార్క్స్ లూథరన్ చర్చి రోడ్డులో మోకాలు లోతులో వర్షపునీరు నిలవడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వేటపాలెం మండలంలో అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలు రైతులను నిండా ముంచాయి. వరి పంట సాగు కోసం కొంత మంది రైతులు నారుమడులు, మరి కొంత మంది నాట్లు వేశారు. అయితే ఉదయం నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు కొన్ని ప్రాంతాల్లో నారుమళ్లు వర్షం నీటిలో మునిగాయి. ఇసుక భూముల్లో సాగు చేసిన మినుము పైరు కోసి ఓదెల మీద ఉండటంతో వర్షానికి పూర్తిగా తడిసి పోయింది.

చినగంజాంలో అత్యధిక వర్షపాతం..

తుఫాన్ కారణంగా బాపట్ల జిల్లాలో అత్యధికంగా చినగంజాం మండలంలో 34.6 మి.మీ వర్షపాతం నమోదైంది. మండలంలోని రోడ్లన్నీ జలమయం అయ్యాయి. లోతట్టు ప్రాంతాలలో నీరు వచ్చి చేరింది. రోడ్లపై నీరు ప్రవహించడంతో వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పర్చూరు మండలం పూసపాడు వద్ద కప్పలవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పర్చూరు ఇంకొల్లు గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం కలిగింది.



ఉధృతంగా ప్రవహిస్తున్న కప్పలవాగుపై ప్రమాదకరంగా వాగు దాటుతున్న ఆటో



సెయింట్ మార్క్స్ లూథరన్ చర్చి వద్ద రోడ్డుపై నిలిచిన వర్షం నీరు



వర్షానికి తడిచిన ఓదెల మీద ఉన్న మినుము పైరు

గ్రామాల్లో ఎన్‌ఎల్‌ఎం టీం సభ్యుల పర్యటన



పెదకాకాని: కేంద్ర ప్రభుత్వం ద్వారా రాష్ట్రానికి మంజూరవుతున్న నిధుల సద్వినియోగాన్ని పరిశీలించేందుకు సోమవారం ఎన్‌ఎల్‌ఎం(నేషనల్ లెవల్ మానిటరింగ్ టీం) సభ్యులు పెదకాకాని, అనుమర్లపూడి గ్రామాల్లో పర్యటించారు. టీం సభ్యులు సురేంద్రనాథ్, అశోక్ సాహు కేంద్ర ప్రభుత్వ పథకాల నిర్వహణపై ప్రజలతో మాట్లాడారు. ముందుగా పెదకాకాని ఎన్‌టీఆర్ కాలనీలో డ్వాక్రా మహిళలతో ముఖాముఖి నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న పథకాలను వివరించారు. వాటిని సద్వినియోగం చేసుకుంటున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. పెదకాకాని, అనుమర్లపూడి పంచాయతీల్లో పథకాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. సక్రంగా నిర్వహించాలంటూ అసహనం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ, గృహ నిర్మాణం, పింఛన్ల మంజూరు చేస్తున్న తీరును పరిశీలించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కెల్లంపల్లి శ్రీనివాసరావు, డ్వామా, డీఆర్‌డీఏ అధికారులు పాల్గొన్నారు.